ఈనాడు
కామారెడ్డి
మంగళవారం అక్టోబరు 1, 2024

పోలీసులపై దాడిని ఖండిస్తున్నాం

కామారెడ్డి సంక్షేమం, న్యూస్‌టుడే: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రైవేటు పాఠశాలలో చోటుచేసుకున్న ఘటనలో పోలీసులపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నానని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ పేర్కొన్నారు. స్థానిక ర.భ.శాఖ అతిథిగృహంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పాఠశాలలో ఆరేళ్ల చిన్నారిపై జరిగిన ఘటన వాస్తవమైతే నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ ఘటనపై సామాజిక మాధ్యమాల్లో రకరకాలుగా వార్తలు రావడంతో అనేక వదంతులు వ్యాప్తి చెందాయన్నారు. దీంతో పాఠశాలలో జరిగిన ఆందోళనలో కొందరు అల్లరి మూకలు పోలీసులపై రాళ్లు రువ్వడంతో సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్సై రాజారాం, హెచ్‌సీ అజారుద్దీన్‌లు గాయపడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు బాధ్యులైన వారిపై, సామాజిక మాధ్యమాల్లో అసత్య వార్తలు పెట్టిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ, ఐజీలను కోరినట్లు తెలిపారు. ఇది మతపరమైన సంఘటన కాదన్నారు. వార్తల సేకరణలో జాగ్రత్తగా ఉండాలని కోరారు.


సమావేశంలో మాట్లాడుతున్న షబ్బీర్‌అలీ


అధిష్ఠానానిదే తుది నిర్ణయం..

మంత్రివర్గంలోకి తనను తీసుకోవడం, తీసుకోకపోవడం అధిష్ఠాన నిర్ణయంపైనే ఆధారపడుతుందని తెలిపారు. ఇప్పటికే రెండు పర్యాయాలు మంత్రిగా సేవలందించానన్నారు. ప్రస్తుతం కూడా క్యాబినెట్ ర్యాంకు పదవిలో కొనసాగుతున్నానని పేర్కొన్నారు. డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, పట్టణాధ్యక్షుడు రాజు, పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించరాదు

కామారెడ్డి నేరవిభాగం, న్యూస్‌టుడే : జిల్లాలో 30, 30(ఎ) పోలీసు చట్టాలు అమలు చేస్తున్నట్లు ఎస్పీ సింధూశర్మ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా ఈ నెల మొదటి వారం ఈ చట్టాలు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు. ప్రజలు సభలు, సమావేశాలు, ధర్నాలు, రాస్తారోకోలు వంటివి నిర్వహించరాదన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

అత్యవసర వైద్యం.. అందని దైన్యం



ఈనాడు, కామారెడ్డి,
న్యూస్‌టుడే, కామారెడ్డి వైద్యవిభాగం

★ పల్వంచ మండలం భవానీపేటకు చెందిన ఓ యువకుడికి జ్వరం రాగా.. జిల్లాకేంద్రంలోని జీజీహెచ్‌కు తరలించారు. రోగ నిర్ధారణ ఫలితాలను పరిశీలించిన వైద్యులు హైదరాబాద్ ఆసుపత్రికి సిఫార్సు చేయగా.. అక్కడ పడకలు లేవని దౌలతాబాద్‌కు పంపారు.

★ జిల్లాకేంద్రానికి చెందిన ఓ మహిళ కుక్కకాటుకు గురై జీజీహెచ్‌కు వచ్చారు. సంబంధిత వైద్యులు లేరంటూ.. ఇతర వైద్యులు పరీక్షించారు. ఇక్కడ చికిత్స అందించలేమని.. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు సిఫార్సు చేశారు. రాజధానికి వెళ్లే స్థోమత లేక నిజామాబాద్ జీజీహెచ్‌కు వెళ్లి చికిత్స చేయించుకున్నారు.

అత్యవసర వైద్యసేవల కోసం రోగులు జిల్లాకేంద్రంలోని బోధనాసుపత్రి, వైద్యవిధాన పరిషత్ ఆధ్వర్యంలోని బిచ్కుంద, ఎల్లారెడ్డిలతో పాటు బాన్సువాడ ఆసుపత్రులకు వస్తుండగా.. వైద్యులు ఇతర జిల్లాల దవాఖానాలకు సిఫార్సు చేస్తున్నారు. దీంతో జిల్లాలో నిరుపేదలకు అత్యవసర వైద్యం అందని ద్రాక్షగా మారిన తీరుపై 'ఈనాడు' కథనం.

ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లాలంటే రోగులు వణికిపోతున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్తే మెరుగైన చికిత్స కోసమని సీహెచ్‌సీలకు.. అక్కడి నుంచి ప్రాంతీయ ఆసుపత్రి లేదా బోధనాసుపత్రికి సిఫార్సు చేస్తున్నారు. జిల్లాలో వైద్యకళాశాలను నెలకొల్పిన ప్రభుత్వం.. అనుబంధంగా జిల్లా ఆసుపత్రిని బోధనాసుపత్రిగా మార్చి అన్ని రకాల వైద్య సేవలందేలా అధునాతన వైద్యపరికరాలతో పాటు నిష్ణాతులైన వైద్యులను (ప్రొఫెసర్లు) నియమించింది. కానీ పర్యవేక్షణ లోపం, ఇతరత్రా కారణాలతో అత్యవసర వైద్యం అందకుండా పోతోంది. ఆరోగ్యపరంగా కొంచెం ఇబ్బందికరంగా ఉంటే.. రోగులను నిజామాబాద్ లేదా హైదరాబాద్‌కు వెళ్లాలని సూచిస్తూ చేతులు దులిపేసుకుంటున్నారు.


జిల్లా కేంద్రంలోని జీజీహెచ్ ఆసుపత్రి

తీవ్ర ఇబ్బందులు..

మధ్యాహ్నం రెండు దాటితే వైద్యులు అందుబాటులో ఉండడం లేదని రోగులు, వారి బంధువులు ఆరోపిస్తున్నారు. అత్యవసర వైద్యం కోసం వచ్చే రోగులను హైదరాబాద్, నిజామాబాద్‌కు సిఫార్సు చేస్తున్నారని.. అక్కడికి వెళ్తే కామారెడ్డి బోధనాసుపత్రే కదా.. వారు అక్కడ చేయలేని చికిత్స ఇక్కడ ఎలా చేస్తారంటూ అక్కడి వైద్యులు, సిబ్బంది ప్రశ్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉందని.. ఎల్లారెడ్డి, మద్నూర్, బాన్సువాడ ఆసుపత్రుల్లో ఆ సమయాల్లో వచ్చిన ఒక్క కేసును చేర్చుకోవడం లేదని వాపోతున్నారు. కనీసం చిన్నచిన్న గాయాలకు కూడా చికిత్స అందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు తీవ్రమయ్యాయి.

చర్యలు తీసుకుంటాం

అత్యవసరమైతే తప్పితే వేరేచోటుకు పంపించడం లేదు. బోధనాసుపత్రిలో పడకల సంఖ్య పెరగాలి. ఐసీయూలో పది పడకలు మాత్రమే ఉన్నాయి. వైద్యకళాశాలలో తరగతులు బోధించేందుకు ప్రొఫెసర్లను కేటాయించారు. ఆ స్థాయిలో సీనియర్ రెసిడెంట్స్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, రెసిడెంట్ డాక్టర్లను కేటాయించలేదు. గైనిక్ విభాగంలో రోగులకు సేవలందించే స్థాయిలో వైద్యులు, సిబ్బంది లేరు. డీఎంఈ అధికారుల దృష్టికి తీసుకెళ్లా. సిబ్బంది నిర్లక్ష్యంతో చిన్నచిన్న కేసులను ఇతర చోటుకు సిఫార్సు చేస్తే విచారించి చర్యలు తీసుకుంటాం. **- రాంసింగ్, జీజీహెచ్ పర్యవేక్షణాధికారి, కామారెడ్డి**

కొత్త సార్లు వచ్చేస్తున్నారు

- డీఎస్సీ ఫలితాల విడుదలతో అభ్యర్థుల్లో ఆనందం
- జిల్లాలో 506 పోస్టుల భర్తీకి చర్యలు



న్యూస్‌టుడే, కామారెడ్డి విద్యావిభాగం

సుదీర్ఘకాల నిరీక్షణకు తెరపడింది. ఎట్టకేలకు కొత్త సార్లు త్వరలో రాబోతున్నారు. జిల్లాలో వివిధ విభాగాల్లో 506 ఉపాధ్యాయ స్థానాల భర్తీకి సర్కారు చర్యలు చేపడుతోంది. ఈ ఏడాది జులై 18 నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో డీఎస్సీ పరీక్షలు నిర్వహించగా.. ఫలితాలను సోమవారం ప్రకటించింది.

5వ తేదీ వరకు పరిశీలన..

జిల్లాలో మంగళవారం నుంచి 5వ తేదీ వరకు 1:3 నిష్పత్తిలో వివిధ విభాగాల్లో ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన చేపట్టనున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యాశాఖ జిల్లా కార్యాలయం నం.223లో నిజధ్రువపత్రాలతో రావాలని డీఈవో రాజు సూచించారు. గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించిన పత్రాలతో రావాలన్నారు. విచారణ పత్రంతో పాటు 3 ఫొటోలు తీసుకురావాలన్నారు.

విభాగాల వారీగా..

మొత్తం 506 పోస్టుల్లో ఓసీ 163, ఎస్సీ 85, ఎస్టీ 45, బీసీ(ఏ) 43, బీసీ(బి) 38, బీసీ(సి) 8, బీసీ(డి) 22, బీసీ(ఈ) 14, దివ్యాంగుల కోటాలో 28, ఈడబ్ల్యూఎస్ కోటాలో 43, క్రీడా విభాగంలో 5, విశ్రాంత సైనికుల కోటాలో 12 పోస్టులు భర్తీ చేయనున్నారు. స్థానిక సంస్థల బడుల్లో 481, సాధారణ బడుల్లో 25 భర్తీ చేస్తున్నారు. పత్రాల పరిశీలన అనంతరం ఎంపికైన అభ్యర్థులకు అక్టోబరు 9న హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నియామక పత్రాలు అందించేందుకు యంత్రాంగం కసరత్తు చేస్తోంది. దసరా తర్వాత కొత్త ఉపాధ్యాయులు బడుల్లో చేరే అవకాశాలున్నాయి.

భర్తీ కానున్న పోస్టులు ఇవే..

	★★★	●●●		★★★	●●●
ఎల్‌పీ హిందీ	5	---	ఎస్‌ఏ ఫిజికల్ సైన్స్	8	---
〃 మరాఠీ	3	---	〃 (సాంఘిక)	38	2
〃 తెలుగు	5	1	〃 (ఉర్దూ)	1	1
〃 ఉర్దూ	1	---	〃 (తెలుగు)	9	1
పీఈటీ (తెలుగు)	5	---	〃 (ఉర్దూ)	1	1
ఎస్‌ఏ జీవశాస్త్రం	15	1	〃 (స్పెషల్ ఎడ్యుకేషన్, తెలుగు)	11	---
〃 (ఆంగ్లం)	12	1	ఎస్జీటీ మరాఠీ	11	---
〃 (హిందీ)	8	1	〃 తెలుగు	261	11
〃 (మరాఠీ)	1	---	〃 ఉర్దూ	31	4
〃 తె/మాధ్యమం	17	---	〃 (స్పెషల్ ఎడ్యుకేషన్, తెలుగు)	36	---
〃 ఫిజికల్ ఎడ్యుకేషన్	2	1			

★★★ స్థానిక సంస్థల బడులు ●●● సాధారణ బడులు

చుక్క నీటికి చక్కటి ఫలితం | యాసంగిలో పొద్దుతిరుగుడు | 10గుంటలు.. లాభం ₹10 లక్షలు | రైతేరాజు | వివరాలు 8లో


కబ్జా కోరల్లో జెన్‌కో భూములు

న్యూస్‌టుడే, నిజాంసాగర్, మహ్మద్‌నగర్

భూముల ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో అక్రమార్కుల కన్ను సర్కారు జాగాలపై పడింది. వాటిని చదును చేసి పంటలు సాగు చేసుకుంటున్నారు. ఇదంతా తెలిసినా సంబంధిత శాఖ అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడటం లేదు. దీనికి నిదర్శనం మహ్మద్‌నగర్ మండలం హసన్‌పల్లి గ్రామ శివారులోని జలవిద్యుదుత్పత్తి కేంద్రం(జెన్‌కో) భూములే. భూభారతి సర్వే ప్రకారం 71వ సర్వే నంబరులో 42 ఎకరాలు ఉండాలి. ఇందులో 25-30 ఎకరాలు కబ్జాకు గురైనట్లు తెలుస్తోంది.

హద్దులు దాటి చదును చేసి

జలవిద్యుదుత్పత్తి కేంద్రం చుట్టూ గతంలో హద్దులు వేశారు. సమీపంలోని కొందరు రైతులు ఆ భూములను ఆక్రమించే ఉద్దేశంతో హద్దులను చెరిపేసి చదును చేశారు. ఈ కారణంగా భారీ విద్యుత్తు స్తంభాల పునాదులు బలహీనంగా మారి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. హసన్‌పల్లిలో ఎకరం భూమి సుమారు రూ.10-15 లక్షల ధర పలుకుతోంది. ఈ లెక్కన రూ.3-4 కోట్ల విలువ కలిగిన భూమి కబ్జాకు గురైనట్లు తెలుస్తోంది.


జెన్‌కో భూమి చదును చేయడంతో ప్రమాదకరంగా మారిన విద్యుత్తు స్తంభం

సర్వే చేయాలని ఆదేశాలు..

జెన్‌కో సివిల్ డైరెక్టర్ అజయ్ గత నెల 27వ తేదీన నిజాంసాగర్ జలాశయం జలవిద్యుదుత్పత్తి కేంద్రాన్ని పరిశీలించారు. సంస్థ భూముల కబ్జాపై సర్వే చేపట్టి పూర్తి నివేదికను అందజేయాలని అధికారులను ఆదేశించారు.

సమయం పడుతుంది..

హసన్‌పల్లి గ్రామ శివారులోని జెన్‌కో భూములు కబ్జాకు గురైనట్లు సమాచారం వచ్చింది. సర్వేయర్లతో సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేయిస్తాం. దానికి కొంత సమయం పడుతుంది. **- నియంతరెడ్డి, సివిల్ ఏఈఈ, జెన్‌కో ఇన్‌ఛార్జి, నిజాంసాగర్.**

ఇందూరు అభివృద్ధే లక్ష్యం

- ప్రతి శాఖలో మార్పు రావాలి
- సమీక్ష సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు

నిజామాబాద్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: అన్ని రంగాల్లో నిజామాబాద్ అభివృద్ధే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, అధికారులు పనిచేయాలని రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక శాఖ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు. కలెక్టరేట్‌లో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, రాకేశ్‌రెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుతో కలిసి సోమవారం సమీక్ష నిర్వహించారు. ప్రధానంగా వ్యవసాయం, విద్య, ఆరోగ్య శాఖపై చర్చించారు. ప్రతి శాఖలో మార్పు కనిపించేలా పాలన ఉండాలన్నారు. అర్హులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేస్తున్నామని, సాంకేతిక కారణాలతో కొందరికి కాలేదని, క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి ఇబ్బందులు తొలగిస్తున్నారని తెలిపారు. ఏకకాలంలోనే చేయాల్సి ఉన్నా గత ప్రభుత్వ అప్పులకే సరిపోతుందని.. అందుకే మూడు దశల్లో చేసినట్లు విలేకరి ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఈ సీజన్‌లో 505 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ప్రతి పాఠశాల, కళాశాలలో మౌలిక వసతులు కల్పించి నాణ్యమైన బోధన అందేలా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్‌తో పాటు ప్రజాప్రతినిధులు తనిఖీలు చేస్తే సమస్యలు తెలుస్తాయన్నారు. పాఠశాలల రేషనలైజేషన్ వారం రోజుల్లో పూర్తి చేయాలని డీఈవోను ఆదేశించారు. మంజూరు చేసిన నిధుల్లో సగం విద్య, వైద్య రంగాలకు వెచ్చించాల్సిన అవసరం ఉందన్నారు. డెంగీ, మలేరియా, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ ఛైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ అన్వేష్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ ఛైర్మన్ మార గంగారెడ్డి, డీసీసీబీ, డీసీఎంఎస్ ఛైర్మన్లు రమేశ్‌రెడ్డి, తారాచంద్, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, మేయర్ నీతూ కిరణ్, నగర కమిషనర్ మకరందు, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో పాల్గొన్నారు.



నిజామాబాద్ కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, చిత్రంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, రాకేశ్‌రెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, తాహెర్ తదితరులు

ఎకరం భూమికి ఎసరు..!

- తప్పుడు ధ్రువపత్రాల జారీ
- సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు

న్యూస్‌టుడే, జుక్కల్

ఓ మహిళ మృతితో కుటుంబీకుల్లో, బంధువుల్లో అగ్గి రాజుకొంది. ఆమె పేరిట ఉన్న ఎకరం భూమికి ఎసరు పెట్టారు. ఆ భూమి తమకు చెందుతుందంటే.. తమకే చెందుతుందంటూ లొల్లి జరుగుతోంది. చట్టం ప్రకారం భూమి ఎవరికి చెందుతుందనేది తర్వాత విషయం. కానీ మహిళ మరణ ధ్రువపత్రం జారీ ప్రకంపనలు సృష్టిస్తోంది. విషయమేమిటంటే.. జుక్కల్ మండలం మొహ్మదాబాద్ గ్రామానికి చెందిన ఓ మహిళ 2024 ఆగస్టు 10న మృతి చెందారు. ఆమె భర్తకు ఇద్దరు భార్యలు. ఇద్దరిలో మృతురాలు ఒకరు. ఈమెకు సంతానం లేరు. మహిళ సంగారెడ్డి జిల్లా ఆస్పత్రిలో మృతి చెందినట్లు ఆమె తమ్ముడు ఆగస్టు 12న సంగారెడ్డి మున్సిపాలిటీలో దరఖాస్తు చేసుకొన్నారు. ఆయనకు ఆగస్టు 17న సంగారెడ్డి మున్సిపాలిటీ అధికారులు మరణ ధ్రువపత్రం జారీ చేశారు. ఇంకో భార్య తరపున ఉన్నవాళ్లు సెప్టెంబరు 5న మొహ్మదాబాద్ పంచాయతీలో దరఖాస్తు చేసుకొన్నారు. పంచాయతీ కార్యదర్శి జీవన్.. మహిళ మొహ్మదాబాద్‌లో మృతి చెందినట్లు సెప్టెంబరు 25న మరణ ధ్రువపత్రం జారీ చేశారు. విశేషమేమిటంటే.. పత్రంలో మృతురాలి భర్త పేరును మార్చేశారు. ఒకే వ్యక్తి రెండు చోట్ల మృతి చెందినట్లు రెండు మరణ ధ్రువపత్రాలు జారీ కావడం చర్చనీయాంశంగా మారింది. ఎకరం భూమి కోసం జరుగుతున్న నాటకీయ పరిణామంలో అధికారులు.. కాసుల కక్కుర్తితో తప్పుడు పత్రాలు జారీ చేయడం కొసమెరుపు. ఆ పత్రాలతో ఆ భూమిని తమ పేరిట పట్టామార్పిడి (పౌతి) చేయాలంటూ రెవెన్యూ కార్యాలయ మెట్లు ఎక్కేందుకు రెండు కుటుంబాలు సిద్ధమయ్యాయి. ఈ నేపథ్యంలో స్థానికులు బాన్సువాడ ఆర్డీవో కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై 'న్యూస్‌టుడే' ఎంపీవో రామును వివరణ కోరగా.. తప్పుడు పత్రాలు సమర్పించి మరణ ధ్రువపత్రం పొందినట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. మృతురాలి పేరిట ఉన్న భూమి పట్టా మార్పిడి ఆపాలని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. పంచాయతీ కార్యదర్శి జీవన్ వివరణ ఇస్తూ.. స్థానికుల సమాచారంతో పాటు వివిధ పత్రాలు సమర్పించడంతో మరణ ధ్రువపత్రం జారీ చేశామని, విషయం తెలిసిన వెంటనే దాన్ని వెంటనే వెనక్కు తీసుకున్నామని తెలిపారు.


సంగారెడ్డి మున్సిపాలిటీ నుంచి జారీ చేసిన మరణ ధ్రువపత్రం


మొహ్మదాబాద్ పంచాయతీ నుంచి జారీ చేసిన మరణ ధ్రువపత్రం

నీటి సంరక్షణపై నివేదికలివ్వండి

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపునకు సంబంధించిన పనుల నివేదికలు సిద్ధం చేయాలని పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్టోబరు 8 నుంచి 10 వరకు జిల్లాలో కేంద్ర జలశక్తి బృందం పర్యటిస్తుందన్నారు. నీటి సంరక్షణకు సంబంధించి ఆయా శాఖలు నివేదికలు తయారు చేసి అందించాలని సూచించారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్‌డీవో సురేందర్, జడ్పీ సీఈవో చందర్, డీపీవో శ్రీనివాస్‌రావు, భూగర్భజలశాఖ ఏడీ సతీష్‌యాదవ్, డీఏవో తిరుమల ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ సుజాత, పంచాయతీరాజ్ ఈఈ దుర్గాప్రసాద్, జిల్లా ఉద్యానవనశాఖ అధికారిణి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

జిల్లాకు కేంద్రమంత్రి రాక నేడు

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: కామారెడ్డి జిల్లాకేంద్రానికి మంగళవారం కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి రానున్నారు. ఉదయం 10.30 గంటలకు కొత్తబస్టాండులో స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం సుభాశ్‌రోడ్డు, తిలక్‌రోడ్డులో భాజపా సభ్యత్వ నమోదులో పాల్గొని.. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి రాజారెడ్డి గార్డెన్స్‌లో నిర్వహించే కార్యకర్తల సమావేశానికి హాజరవుతారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి నరేందర్‌రెడ్డి కోరారు.

నేరాలను నియంత్రించాలి

నిజాంసాగర్, మహ్మద్‌నగర్, న్యూస్‌టుడే: గ్రామాల్లోని కూడళ్ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నేరాలను నియంత్రించాలని జిల్లా ఎస్పీ సింధూశర్మ అధికారులను ఆదేశించారు. నిజాంసాగర్ ఠాణాను సోమవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాత్రిపూట పెట్రోలింగ్ నిర్వహించి దొంగతనాలను నియంత్రించాలని సూచించారు. వెంట బాన్సువాడ డీఎస్పీ సత్యనారాయణ, ఎస్సై సుధాకర్, ఏఎస్సై రాజేశ్వర్, సిబ్బంది ఉన్నారు.


నిజాంసాగర్ ఠాణాలో అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ

అర్హులందరికీ రుణమాఫీ చేయాలి

గాంధారి, న్యూస్‌టుడే: అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని అన్నదాతలు గొంతెత్తారు. అఖిలపక్షం ఆధ్వర్యంలో సోమవారం గాంధారిలో రైతులు 'మహా ధర్నా' చేశారు. గంటన్నర పాటు గాంధారి-బాన్సువాడ రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆందోళనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరి పంటకు క్వింటాకు రూ.500 బోనస్ చెల్లిస్తానని హామీనిచ్చిన సీఎం రేవంత్ ఇప్పుడు కేవలం సన్న వరికి మాత్రమే ఇస్తాననడం సరికాదన్నారు. కార్యక్రమంలో భాజపా, భారాస నాయకులు, రైతు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే సురేందర్

దొంగతనం చేశారని.. పిల్లలకు వాతలు పెట్టిన తల్లి..

కామారెడ్డి నేరవిభాగం: ఇంట్లోని దేవుడి హుండీలోని డబ్బులు దొంగతనం చేశారనే కోపంతో తన ఇద్దరు పిల్లలకు కన్నతల్లి సలాకతో వాతలు పెట్టిన ఘటన జిల్లా కేంద్రంలో సోమవారం వెలుగుచూసింది. ఈ విషయాన్ని పిల్లలిద్దరూ పాఠశాలలో ఉపాధ్యాయులకు చెప్పడంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకొని ఆమెను పిలిపించారు. కోపంలో తానే వాతలు పెట్టానని, తనను క్షమించాలని పోలీసులను కోరడంతో సమస్య సమసిపోయింది.





10 గుంటలు.. లాభం ₹10 లక్షలు

న్యూస్‌టుడే, ఆర్మూర్ గ్రామీణం

అందరూ సాగు చేసే పంటలు పండిస్తే మార్కెట్‌లో గిట్టుబాటు ధర రాదు. ఎవరూ సాగుచేయని కొత్త రకానికి చెందిన ఆస్పరాగస్ పంటను గత అయిదేళ్లుగా సాగుచేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు ఆర్మూర్ పట్టణానికి చెందిన రైతు దడిగె శ్రీనివాస్. పెళ్లిళ్లు, శుభకార్యాల వేదికలపై చేసే అలంకరణకు, బొకేల తయారీలో ఈ ఆస్పరాగస్‌ను విరివిగా ఉపయోగిస్తున్నారు.


ఆస్పరాగస్ క్షేత్రంలో రైతు శ్రీనివాస్

రైతేరాజు

20 ఏళ్ల వరకు దిగుబడి


హైదరాబాద్ నాగోల్ ప్రాంతం నుంచి రూ. 52 వేలు ఖర్చుపెట్టి 3500 ఆస్పరాగస్ మొక్కలను తీసుకొచ్చారు. అయిదేళ్ల కిందట నాటుకున్నారు. ఆరు నెలల తర్వాత పంట కోతకు వచ్చింది. సేంద్రియ, కాంప్లెక్స్ ఎరువులు, ఇతర సస్యరక్షణ మందులకు గాను రూ.48 వేలు ఖర్చు చేశారు. అప్పటి నుంచి పంట ప్రతి మూడు నెలలకోసారి దిగుబడి వస్తుందని రైతు చెబుతున్నారు. ఆ సమయంలో రూ.70 వేల ఆదాయం సమకూరుతుందన్నారు. ఇప్పటి వరకు పెట్టుబడి ఖర్చులు పోనూ రూ.10 లక్షలకు పైగా లాభం వచ్చినట్లు చెప్పారు. మొక్కలు ఒక్కసారి నాటుకుంటే సరిపోతుందని 20 ఏళ్ల పాటు దిగుబడి ఇస్తాయని ఆయన చెబుతున్నారు.

మార్కెట్‌లో డిమాండ్ ఉంది

- శ్రీనివాస్, రైతు, ఆర్మూర్

ఆర్మూర్ ప్రాంతంలో ఆస్పరాగస్‌కు మంచి డిమాండ్ ఉంది. కల్యాణమండపాలు, ఇతర అలంకరణ పనులు చేసేవారు పంట క్షేత్రానికి వచ్చి సొంతంగా కొనుగోలు చేసి తీసుకెళ్తున్నందున ఎలాంటి మార్కెటింగ్ ఇబ్బందులు లేవు. ఈ ఏడాది మరో 10 గుంటల విస్తీర్ణంలో ఆస్పరాగస్ మొక్కలు నాటుకున్నా. డిసెంబర్ వరకు పంట కోతకు వస్తుంది.

ముదిమిలో మురిపిద్దాం



న్యూస్‌టుడే, ఇందూరు ఫీచర్స్

ముదిమి వయసు వారిని మురిపించాల్సిన అవసరముంది. కానీ వృద్ధుల విషయంలో సమాజంలో చోటు చేసుకుంటున్న పరిణామాలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. వయోధికులను భారంగా పరిగణిస్తూ.. వదిలించుకోవాలని యోచిస్తున్నారు. ఒక దశలో వృద్ధులు తమకు తాముగా బలవన్మరణానికి యత్నిస్తే.. కొన్ని సందర్భాల్లో కన్నవారి చేతుల్లోనే ప్రాణాలు కోల్పోవాల్సి వస్తోంది. సమాజంలో వృద్ధులంటే వయసు మళ్లి ఏ పని చేయలేని స్థితి అన్న భావన ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే వారిని ఆదరించి, వారి అనుభవాన్ని గౌరవించాలన్న ఉద్దేశంతో అక్టోబరు 1న ప్రపంచ వృద్ధుల దినోత్సవం నిర్వహిస్తున్నారు.

ఆదరణ కరవు..

కన్నబిడ్డల పిల్లలతో సరదగా గడిపేదే ముదిమి వయసు. కారణాలేమైనా కాలక్రమంలో చిన్న కుటుంబాల సంస్కృతి పెరిగిపోయింది. కుటుంబాల్లో వృద్ధులకు చోటు లభించడం లేదు. ఫలితంగా ఒంటరిపక్షుల్లా జీవించాల్సి వస్తుంది. గ్రామాల్లో ఉంటే ఎవరో ఒకరితో మాటా..ముచ్చట, యోగక్షేమాలు తెలుసుకుని సాయం అందిస్తారు. పట్టణాలు, నగరాల్లో అయితే ఎవరి అవసరాలు వారు తీర్చుకోవడానికే సమయం ఉండదు. అందుకే ఇక్కడ ఒంటరి బతుకులన్న భావన కుంగదీస్తుంటుంది. ఇక కొందరు ఆస్తి కోసం తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తుండటం దయనీయం. ఇంట్లో నుంచి గెంటేసే వారు కొందరైతే.. డబ్బులిచ్చి వృద్ధాశ్రమాల్లో చేర్పించేవారు మరికొందరు. ఇలాంటి ఘటనలు జిల్లాలోనూ చోటు చేసుకోవడం కలవరపెట్టే అంశం.

ఉమ్మడి జిల్లాలో చోటుచేసుకున్న ఘటనలు..

- కామారెడ్డి జిల్లాకు చెందిన ఒక వృద్ధుడు తన భార్య చనిపోయాక ఒంటరయ్యారు. కొడుకులున్నా పట్టించుకోవడం మరిచిపోయారు. గత్యంతరం లేక ఒక ఆశ్రమంలో తలదాచుకుంటున్నారు.
- ఎడపల్లిలో ఆస్తి కోసం తనయుడు తల్లిదండ్రులను వేధింపులకు గురి చేశాడు. భరించలేని వారు పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు కాకపోయినా.. ఘటన ఠాణా వరకు రావడం చర్చనీయాంశమైంది.
- బోధన్‌కు చెందిన వ్యక్తి జీవితకాలమంతా శ్రమించి ఆస్తులు కూడబెట్టారు. ఆయన చనిపోయాక ఆస్తి భార్య పేరు మీదకు బదిలీ అయింది. దాన్ని తమ పేరుకు మార్చాలని రోజూ ఆ తల్లికి వేధింపులు. చివరకు పెద్ద మనుషుల ఒప్పందంలో ఆస్తిని పిల్లల పేరు మీదకు బదిలీ చేశాక.. తల్లిని పట్టించుకునే నాథుడు లేడు. సర్కార్ పింఛన్‌తో ఆమె జీవిస్తున్నారు.
- నిజామాబాద్ జిల్లాకు చెందిన ఒక వృద్ధురాలి పేరుతో భర్త సంపాదించిన రెండు ఇంటి స్థలాలు ఉన్నాయి. వాటిని పంచాలని ముగ్గురు పిల్లలు డిమాండు చేశారు. ఆమె ఈ ఆస్తిని తనతో కలిపి నాలుగు భాగాలుగా పంచారు. తల్లి పేరుతో ఉన్న వాటాను తనయులు ఆమెకు తెలియకుండానే తమ పేరు మీదకు మార్చుకున్నారు. ఏ పని చేయలేని స్థితిలో కుమారులు నిర్లక్ష్యం చేయడంతో ఆమె దయనీయ జీవితం గడుపుతున్నారు.

మరణించినా రావట్లేదు..

బోధన్ మండలంలోని ఓ వృద్ధాశ్రమంలో ఇతర ప్రాంతాల నుంచి తల్లిదండ్రులను తీసుకొచ్చి వదిలేసి వెళ్తున్నారు. వారు చచ్చిపోయినట్లు సమాచారమిచ్చినా పిల్లలు రాకపోవడంతో గ్రామస్థుల సాయంతో ఆశ్రమ నిర్వాహకులే అంత్యక్రియలు నిర్వహించారు. అలా ఈ ఏడాది ఇద్దరి అంతిమ సంస్కారాలు చేశారు. ఇలాంటి ఘటనలు తరచూ వెలుగు చూస్తున్నాయి.



నిర్లక్ష్యంపై ఆశ్రయించొచ్చు

..మురహరి, సీనియర్ సిటిజన్స్ ఫోరం డివిజన్ అధ్యక్షుడు

తల్లిదండ్రులను పిల్లలు నిర్లక్ష్యం చేస్తే ఆర్డీవో కార్యాలయంలోని కన్సిలియేషన్ కేంద్రాన్ని ఆశ్రయించొచ్చు. అక్కడ సబ్‌కలెక్టర్/ఆర్డీవో ఆధ్వర్యంలో విచారణ చేసి న్యాయం చేస్తారు. ఆస్తికి సంబంధించిన కేసుల్లో తలెత్తే వివాదాలే ఎక్కువగా వస్తుంటాయి. నిరాదరణకు గురైన వృద్ధులు సహాయ కేంద్రం 14567 నంబరుకు ఫోన్ చేయవచ్చు. మొహమాటం, భయం లేకుండా సమస్యను సామరస్యంగా పరిష్కరించుకుని హక్కులు సాధించుకోవాలని కోరుతున్నాం.

చుక్క నీటికి చక్కటి ఫలితం

బోధన్ గ్రామీణం, న్యూస్‌టుడే: సాగుకు ఖర్చులు పెరుగుతున్న నేపథ్యంలో పెట్టుబడి తగ్గించుకోవడం మేలన్న అభిప్రాయం రైతుల్లో వ్యక్తం అవుతోంది. సాలూర మండలం సరిహద్దు గ్రామమైన హున్సాలో రైతులు వాణిజ్య పంటల సాగుకు బిందు, తుంపర సేద్యంపై దృష్టిసారించారు.

200 ఎకరాల్లో: హున్సాలో సుమారు 200 ఎకరాల్లో బిందు సేద్యంతో అరటి, బొప్పాయి వంటి పండ్ల తోటలు, చెరకు, కూరగాయలకు ఈ విధానాన్ని పాటిస్తున్నారు. పదేళ్ల కిందట ఒకరిద్దరూ రైతులు పాటించే పద్ధతిని ప్రస్తుతం 50 నుంచి 60 మంది ఆచరిస్తున్నారు.

కలుపు నివారణకు తోడ్పాటు. బిందుసేద్యంతో 90 శాతం కలుపు నివారించవచ్చు. పంట అంతటికి సమాన స్థాయిలో ఎరువులు అందుతుంది. నేరుగా మొక్క దగ్గరే చుక్క చుక్కగా నీరు పడి వృథా కాకుండా ఉంటుంది. విద్యుత్తు ఆదాతోపాటు భూమి గుల్లబారుతుంది. రెండు గంటల్లో అయ్యే పని గంటలోనే పూర్తవుతుంది. అరటిలో ఎకరానికి ఐదు క్వింటాళ్లకు పైగా దిగుబడులు వస్తాయని, తక్కువ శ్రమతో రైతు 10 నుంచి 20ఎకరాల వరకు సాగుచేసుకోవచ్చని చెబుతున్నారు.


బిందుసేద్యంతో సాగవుతున్న అరటితోట

దిగుబడులు బాగా వస్తున్నాయి

- డి.ఎస్.స్వామి, రైతు



15 ఏళ్ల నుంచి బిందు సేద్యంతో పంటల సాగుచేస్తున్నా. మంచి ఫలితాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం ఐదెకరాల్లో అరటి, ఎకరంలో బొప్పాయి పండిస్తున్నా. రెండేళ్ల కిందట అరటిలో 45 టన్నుల దిగుబడి సాధించి రికార్డు పొందాను. దీంతో అప్పటి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి సత్కరించారు. సాధారణ పద్ధతిలో పోల్చితే బిందు సేద్యం ద్వారా ప్రతి మొక్కకు ఐదారు కిలోల దిగుబడి అదనంగా వస్తుంది. రైతులకు ప్రభుత్వం బిందు పరికరాలు అందిస్తే మంచి దిగుబడులు సాధిస్తాం.

యాసంగిలో పొద్దుతిరుగుడు

బోధన్ గ్రామీణం : వేరుశనగ, నువ్వుల నూనె కంటే పొద్దు తిరుగుడు నూనె శ్రేష్ఠమైంది. దీని నుంచి వనస్పతి తయారుచేస్తారని.. వార్నిష్, సబ్బు, కలప పరిశ్రమల్లో ఈ నూనెను అధికంగా ఉపయోగిస్తారని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. పొద్దుతిరుగుడు నూనె తీసిన తర్వాత వచ్చే పిండి పశువులకు దాణాగా ఉపయోగించుకోవచ్చని బోధన్ మండల వ్యవసాయాధికారి సంతోష్ తెలిపారు. ఈ సాగుకు అవసరమైన సూచనలు, సలహాలు తెలియజేస్తున్నారు.



విత్తే సమయం: నీటిపారుదల పంటగా సంవత్సరం పొడవున పండించవచ్చు. విత్తే సమయంలో పూతదశ, గింజలు తయారయ్యేదశలో పంట దీర్ఘకాల వర్షంతోగాని లేదా పగటి ఉష్ణోగ్రత 38 సెల్సియస్ కంటే ఎక్కువగా ఉండకుండా చూసుకోవాలి. యాసంగిలో వర్షాధారం కింద అక్టోబరులో నీటిపారుదల కింద నవంబరు రెండో పక్షం నుంచి జనవరి మొదటి 15 రోజుల వరకు విత్తుకోవచ్చు.

నల్లరేగడి నేలల్లో తొందరగా నాటుకున్నట్లయితే దిగుబడి బాగా వస్తుంది. ఎర్ర, నల్లరేగడి నేలల్లో వరి తర్వాత పొద్దుతిరుగుడును డిసెంబరు ఆఖరి వారం నుంచి జనవరి మొదటి వారం వరకు విత్తుకోవాలి. పువ్వు వికసించి విత్తనం గట్టిపడే సమయాల్లో పగలు 12 గంటలు సూర్యరశ్మి ఉన్నట్లయితే నూనె శాతం అధికంగా వస్తుంది. నూనె నిల్వ సామర్థ్యం వానాకాలం కంటే వేసవిలో అధికంగా ఉంటుంది. నీటిపారుదల ఉన్నట్లయితే ఏడాది పొడవున సాగుచేయవచ్చు. అయితే యాసంగి, వేసవిలో విత్తుకుంటే అధిక దిగుబడినిస్తుంది.

నేలలు: నీరు నిల్వ ఉండని తటస్థ భూములైన ఎర్ర, చల్కా, ఇసుక, రేగడి, ఒండ్రునేలలు ఈ సాగుకు శ్రేష్ఠం. ఉదజని సూచిక 6.5 నుంచి 8.0 ఉంటే చాలా అనుకూలం. ఆమ్ల లక్షణాలు కంటే క్షార విలువలు కలిగిన నేలల్లో పంట బాగా పండుతుంది. పంట అధిక తేమను తట్టుకోలేదు కావున లోతట్టు, సముద్రతీర ప్రాంతాల్లో సాగుచేయరాదు. అంతర పంటలుగా కంది, వేరుశనగ వంటివి వేసుకుంటే అదనపు ఆదాయం వస్తుంది.


రైతు ప్రశ్న సమాధానం

? కంది పంటలో ఆకు గూడు పురుగు ఆశిస్తోంది. నివారణ చర్యలు తెల్పండి?

కంది పంటలో ఆకు గూడు పురుగు నివారణకు 1.6మి.లీ. మోనోక్రోటోఫాస్ లేదా 2.0 మి.లీ క్వినాల్‌ఫాస్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేస్తే సత్ఫలితం ఉంటుంది.

- సంతోష్, మండల వ్యవసాయాధికారి బోధన్

న్యూస్‌టుడే, బోధన్ గ్రామీణం



నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ అండ

పిట్లం, న్యూస్‌టుడే: నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు అన్నారు. సోమవారం పిట్లం మండల కేంద్రంలోని ఏఎంసీ ఆవరణలో పిట్లం, నిజాంసాగర్, పెద్దకొడప్‌గల్ మండలాల్లోని ఆయా గ్రామాల లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం కార్యకర్తలతో సమావేశం నిర్వహించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మండలాధ్యక్షుడు జంబిగ హన్మాండ్లు, రాంరెడ్డి, ఆయా మండలాల నాయకులు తదితరులు ఉన్నారు.


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు

కార్మికుల సమస్యలు పరిష్కరిస్తా

మద్నూర్, న్యూస్‌టుడే: సఫాయి కార్మికుల సమస్యలు పరిష్కరిస్తానని ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు తోట అన్నారు. సోమవారం మద్నూర్ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్మికుల సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారికి గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేశారు. మొక్కలు నాటి నీళ్లు పోశారు. వైద్య శిబిరం ఏర్పాటు చేసి కార్మికులకు వైద్య పరీక్షలు చేశారు. డీఎల్‌పీవో నాగరాజు, ఎంపీడీవో రాణి, తహసీల్దార్ ముజిబ్ తదితరులు ఉన్నారు.

టీఎన్జీవోస్ సభ్యత్వ నమోదు

గాంధారి, న్యూస్‌టుడే: కామారెడ్డి టీఎన్జీవోస్ ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు ఎల్లారెడ్డి తాలుకా యూనిట్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాలతో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ‘ఉద్యోగుల ప్రాథమిక సభ్యత్వ నమోదు’ కార్యక్రమం నిర్వహించారు. ఉద్యోగులకు అందుబాటులో ఉంటూ..సమస్యలను పరిష్కరిస్తామని ఎల్లారెడ్డి టీఎన్జీవోస్ అధ్యక్షుడు మహిపాల్ అన్నారు. కార్యదర్శి శరణ్, సభ్యులు రవి, రాజగౌడ్, శ్రీకాంత్, గాంధారి తహసీల్దార్ సతీష్‌రెడ్డి, ఆర్ఐ ప్రదీప్, మండల స్థాయి ఉద్యోగులు పాల్గొన్నారు.


ఉద్యోగులకు పత్రాలను అందజేస్తున్న నాయకులు

మహాసభలు విజయవంతం చేయాలి

కామారెడ్డి వ్యవసాయం, న్యూస్‌టుడే: భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఈనెల 5న తలపెట్టిన రాష్ట్రస్థాయి రైతు మహాసభలను విజయవంతం చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు జోగినపల్లి శ్రీరంగరావు, జాతీయ కార్యదర్శి సాయిరెడ్డిలు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రం శివారులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం నిర్వహించిన జిల్లాస్థాయి కార్యవర్గ సమావేశం, రాష్ట్రస్థాయి రైతు మహాసభ నిర్వహణ సన్నాహక సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకిచ్చిన హామీలను నెరవేర్చాలనే డిమాండ్‌తో ఈ సభ తలపెట్టామన్నారు. జిల్లా కమిటీని ఎన్నుకున్నామన్నారు. గ్రామ, మండల, జిల్లా కమిటీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర, జిల్లా నాయకులు

జిల్లా కమిటీ అధ్యక్షుడిగా పైడి విఠల్‌రెడ్డి

భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కమిటీ అధ్యక్షుడిగా పైడి విఠల్‌రెడ్డి ఎన్నికయ్యారు. సంఘం కార్యదర్శిగా శంకర్‌రావు, ఉపాధ్యక్షులుగా సాయిరెడ్డి, రాజేశం, సహాయ కార్యదర్శులు తదితరులను ఎన్నుకున్నారు. క్షేత్ర సంఘటన మంత్రి దేవనూరు రాము, కొమిరెడ్డి అంజన్న, ఆనంద్‌రావు, జోనల్ అధ్యక్షుడు లొంక వెంకట్‌రెడ్డి, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

గాంధారి, న్యూస్‌టుడే: అక్టోబరు 5న జిల్లా కేంద్రంలో జరిగే భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర మహా సభ ఏర్పాట్లకు రూ.లక్షను విరాళంగా జోనల్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డికి రాష్ట్ర అధ్యక్షులు శ్రీరంగారావు సోమవారం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాష్ట్ర మహా సభను విజయవంతం చేయాలని రైతులకు పిలుపునిచ్చారు. గాంధారికి చెందిన జిల్లా కార్యదర్శి శంకరరావు, జిల్లా స్థాయి రెవెన్యూ సమస్యల ప్రతినిధి సాహెబ్‌రావు పాల్గొన్నారు.


వెంకట్‌రెడ్డికి రూ.లక్ష విరాళంగా ఇస్తున్న శ్రీరంగారావు


కామారెడ్డి ఉద్యోగులను అభినందిస్తున్న జిల్లా అటవీ శాఖ అధికారిణి బోగ నిఖిత, కామారెడ్డి ఎఫ్‌డీవో రామకృష్ణ

జోనల్ పోటీల్లో సత్తాచాటిన కామారెడ్డి

కామారెడ్డి నేరవిభాగం, న్యూస్‌టుడే: సిద్దిపేటలో రెండు రోజులుగా జరిగిన అటవీ శాఖ జోనల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ 2024లో కామారెడ్డి జిల్లా ఉద్యోగులు సత్తాచాటారు. పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విజేతలుగా నిలిచారు. కబడ్డీలో పురుషులు, మహిళల జట్లు ప్రథమ బహుమతిని గెలుచుకున్నారు. వాలీబాల్‌లో పురుషులు మొదటి, మహిళలు రెండో స్థానాల్లో నిలిచారు. పరుగు పందెంలో 100, 200, 400, 800 మీటర్లలో, 10 కిలోమీటర్ల విభాగాల్లో మహిళలు, పురుషులు ప్రథమ స్థానాలను దక్కించుకున్నారు. టగ్ ఆఫ్ వార్, సైక్లింగ్‌లో మహిళలు మొదటి స్థానం కైవసం చేసుకున్నారు. విజేతలను జిల్లా అటవీ అధికారిణి బోగ నిఖిత, కామారెడ్డి ఎఫ్‌డీవో రామకృష్ణ అభినందించారు. భవిష్యత్‌లో రాష్ట్రస్థాయిలో సైతం ఇదేవిధమైన స్ఫూర్తిని కొనసాగించాలని పేర్కొన్నారు.

అటవీ భూములు కాపాడండి

గాంధారి, న్యూస్‌టుడే: గాంధారి మండల పరిధిలో అన్యాక్రాంతమవుతున్న అటవీ భూములను కాపాడాలంటూ.. గౌరారం వాసులు రాష్ట్ర అటవీ సంరక్షణ ప్రధానాధికారి(పీసీసీఎఫ్), హెడ్ ఆఫ్ ఫారెస్ట్ ఫోర్స్(హెచ్‌వోఎఫ్ఎఫ్) సీనియర్ ఐఎఫ్ఎస్ అధికారి రాకేష్ మోహన్ డోబ్రియాల్‌కు సోమవారం హైదరాబాద్‌లో వినతి పత్రం అందజేశారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌ను కలిసి సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మాజీ సర్పంచి అంజయ్య, తూము అంజయ్య, వంజరి, శంకర్, అంజయ్యలు పాల్గొన్నారు.

చిన్నకొడప్‌గల్‌లో సభ రసాభాస

పిట్లం, న్యూస్‌టుడే: చిన్నకొడప్‌గల్ సొసైటీ ఆవరణలో సొసైటీ ఛైర్మన్ నాగిరెడ్డి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన మహాజన సభ రసాభాసకు దారితీసింది. సొసైటీ కార్యదర్శి హన్మాండ్లు ఆదాయ, వ్యయాలు చదివి వినిపించారు. అంతలోనే రైతులు రుణమాఫీ అందరికీ ఎందుకు కాలేదని కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సొసైటీ పరిధిలో 207 మంది రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపర్చడంలో సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా సమస్య తలెత్తిందన్నారు. సొసైటీలో మరణించినవారి పేర్ల మీద ఖాతాలు కొనసాగడం, డమ్మీ ఖాతాలు తెరిచి రుణాలు తీయడం ఏంటని సీఈవోను నిలదీశారు. అంతలోనే రైతులు, ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి వాగ్వాదానికి దారితీసింది. రైతుల పేర్ల మీదుగా రెండు ఖాతాలు ఉండటంపై పూర్తి విచారణ జరపాలని, రుణమాఫీ కానీ రైతులందరికీ ఏకకాలంలో మాఫీ చేయాలని తీర్మానించారు. రాంపూర్‌కలాన్‌లో సొసైటీ ఆవరణలో సొసైటీ అధ్యక్షుడు శపథంరెడ్డి అధ్యక్షతన మహాజన సభ నిర్వహించారు. కార్యదర్శి సంతోష్‌రెడ్డి, సొసైటీ పాలకవర్గ సభ్యులు, రైతులు, నాయకులు తదితరులు ఉన్నారు.


చిన్నకొడప్‌గల్‌లో సొసైటీ కార్యదర్శి హన్మాండ్లును నిలదీస్తున్న రైతులు

రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా రాజేంద్రప్రసాద్

కామారెడ్డి కలెక్టరేట్, ఎల్లారెడ్డి, న్యూస్‌టుడే: కామారెడ్డి రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా పప్పుల రాజేంద్రప్రసాద్ ఎన్నికయ్యారు. ఎల్లారెడ్డిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం జిల్లా కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్ష స్థానానికి పప్పుల రాజేంద్ర ప్రసాద్, గౌరీశంకర్‌లు పోటీపడ్డారు. జిల్లాలో మొత్తంగా 184 ఓటర్లు ఉండగా.. రాజేంద్రప్రసాద్‌కు 121 ఓట్లు రాగా.. గౌరీశంకర్‌కు 63 పోలయ్యాయి. ప్రధాన కార్యదర్శిగా కె. సంతోష్‌కుమార్(బాన్సువాడ), కోశాధికారిగా ముత్యపు సుదర్శన్(ఎల్లారెడ్డి)లు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా కృష్ణమూర్తి, నర్సింహారావులు వ్యవహరించారు.


ఎన్నికైన సభ్యులను సన్మానిస్తున్న ప్రతినిధులు

దుకాణాల బహిరంగ వేలం

ఇస్సన్నపల్లి(రామారెడ్డి), న్యూస్‌టుడే: ఇస్సన్నపల్లి, రామారెడ్డిలోని కాలభైరవస్వామి ఆలయంలో కిరాణం, పూజాసామగ్రి, టెంకాయల దుకాణాలకు దేవాదాయశాఖ పరిశీలకురాలు కమల ఆధ్వర్యంలో సోమవారం బహిరంగ వేలం నిర్వహించారు. వేలంలో పెద్దకోట్ల ఆరోగ్యం రూ. 3,91,000లకు దుకాణాలను దక్కించుకున్నట్లు ఆమె తెలిపారు. ప్రసాదాల దుకాణానికి సరైన వేలం రానందున రద్దు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈవో ప్రభు రాంచంద్రం, జూనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్, శ్రీనివాస్‌శర్మ, నాగరాజు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

మాచారెడ్డి, న్యూస్‌టుడే: మాచారెడ్డి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న అశ్విత, 8వ తరగతి చదువుతున్న రిషితలు ఖోఖోలో, 10వ తరగతి చదువుతున్న తేజశ్విని ఫుట్‌బాల్ క్రీడలో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటచారి తెలిపారు. విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయుల బృందం అభినందించింది.

పరిశోధనలపై దృష్టి సారించాలి

భిక్కనూరు: పాఠశాలస్థాయి నుంచే విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించేలా చర్యలు తీసుకోవాలని భిక్కనూరు ఎంఈవో రాజ్‌గంగారెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం భిక్కనూరు జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో అగస్త్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. విద్యార్థులు రూపొందించిన 25 ప్రదర్శనలను ఎంఈవో పరిశీలించి అభినందించారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేసుకున్నట్లు ప్రిన్సిపల్ శ్రీనాథ్ తెలిపారు. ఫౌండేషన్ ప్రతినిధి శ్రీవాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాటు తుపాకీ స్వాధీనం

ఎల్లారెడ్డి, న్యూస్‌టుడే : ఎల్లారెడ్డి మండలం లక్ష్మాపూర్‌లో ఓ వ్యక్తి నుంచి సోమవారం నాటు తుపాకీని స్వాధీనం చేసుకున్నట్లు అటవీ అధికారులు తెలిపారు. జంతువులను వేటాడుతున్నారనే సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నట్లు తెలుస్తోంది.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

బాన్సువాడ 83284 29129

కామారెడ్డి 93970 82242

సమస్య: జిల్లా కేంద్రంలోని బడా కసాబ్ గల్లీలో చెత్త సేకరించు సిబ్బంది రావడం లేదు. - **ప్రభాకర్, స్థానికుడు**



స్పందన: సిబ్బంది మేరకు క్షేత్రస్థాయిలో సిబ్బందితో చర్యలు చేపట్టం. - **పర్వేజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

సమస్య: బాన్సువాడ మండలంలోని వార్డులో మురుగు కాల్వల వెంట చెత్తనిల్వలు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. - **నవీన్, బాన్సువాడ**



పరిష్కారం: ఈ విషయాన్ని పారిశుద్ధ్య వర్కర్ సతీష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సిబ్బంది చేత చెత్తనిల్వలు తొలగించేయించారు.

సమస్య: కుర్తిలో మజిద్ పక్కన నీటి తొట్టిలో వ్యర్థాలు పారేశారు. దానిని వినియోగంలోకి తీసుకొచ్చి పశువుల దాహార్తి తీర్చాలి. - **నవీన్, స్థానికుడు**

సమాధానం: తొట్టిని పరిశీలించి చర్యలు చేపడతాం. - **వినోద్, పంచాయతీ కార్యదర్శి, కుర్తి**

ప్రశ్న: ఎస్సీ కాలనీకి చెందిన మంచి నీటి ట్యాంకు నుంచి మూడు రోజులుగా తాగునీరు రావడం లేదు.. **సాయికృష్ణ, తాడ్వాయి**

సమాధానం: మోటారుకు మరమ్మతులు చేసి సమస్యను పరిష్కరిస్తాం. - **సాజిద్ అలీ, ప్రత్యేక అధికారి**

సమస్య: మద్నూర్ గ్రామ పంచాయతీ వెనుకాల గల్లీలో మురుగు కాలువలు నిండి అపరిశుభ్రంగా మారింది. **గంగాధర్, మద్నూర్**

సమాధానం: పరిశీలించి వెంటనే శుభ్రం చేయిస్తాం. **సందీప్, గ్రామ కార్యదర్శి, మద్నూర్**

సమస్య: బిచ్కుంద టీచర్స్ కాలనీలో చెత్త నిండి దుర్గంధం వస్తోంది. **..సంతోష్, బిచ్కుంద**

పరిష్కారం: కాలనీలో చెత్తను తొలగించి పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటాం. **..శ్రీనివాస్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి, బిచ్కుంద**

సమస్య: మహ్మద్‌నగర్ మండలం బూర్గుల్ గ్రామ చెరువు సమీపంలో మిషన్ భగీరథ ఆధ్వర్యంలో బోరుబావి వేశారు. దానిలో మోటారు వేసి వాడుకలోకి తీసుకురావాలి. **-రాములు, గ్రామస్థుడు బూర్గుల్.**

పరిష్కారం: బూర్గుల్ గ్రామంలో ప్రస్తుతం ప్రజలకు నీటి సమస్య లేదు. అవసరం ఉంటే దానిని వాడుకలోకి తీసుకువచ్చి అందిస్తాం. **-రమేష్, గ్రామ కార్యదర్శి, బూర్గుల్.**

న్యూస్‌టుడే, కామారెడ్డి పట్టణం, బాన్సువాడ పట్టణం, పిట్లం, తాడ్వాయి, మద్నూర్, బిచ్కుంద, నిజాంసాగర్

విన్నవించాం.. పరిష్కరించాలి..

ప్రజావాణికి వినతుల వెల్లువ



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

న్యూస్‌టుడే, కామారెడ్డి కలెక్టరేట్

జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి వినతులు వెల్లువెత్తాయి. తమ సమస్యలు పరిష్కరించాలని పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్‌కు అర్జీలు అందించి విన్నవించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఆయా శాఖల అధికారులు ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రజావాణికి వచ్చిన బాధితులు పలువురు వారి గోడును 'న్యూస్‌టుడే'కు చెప్పుకొన్నారు.

ఉద్యోగం నుంచి తొలగించారు

నేను కామారెడ్డి మున్సిపాలిటీలో 20 ఏళ్లుగా పొరుగు సేవలపై వాటర్ వర్క్సులో ఔటర్‌గా పనిచేస్తున్నాను. మూడు నెలల క్రితం అకారణంగా తొలగించడంతో నా కుటుంబం రోడ్డున పడింది. కనీసం నోటీసు కూడా ఇవ్వలేదు. అధికారులు దయచేసి నా ఉద్యోగాన్ని నాకు ఇప్పించాలి. **- రాజు, కామారెడ్డి**

నిషేధిత జాబితాలో పెట్టారు

నాకు, నా సోదరులకు గ్రామంలో వారసత్వంగా వచ్చిన భూమి ఉంది. ఎవరి భూమి వారు తీసుకున్నాం. నా పేరిట ఉన్న 1.5 ఎకరాల భూమిని నిషేధిత జాబితాలో పెట్టారు. ఇదే సర్వే నంబరులోని నా సోదరుల భూమిని ఆ జాబితా నుంచి తొలగించారు. రెండేళ్ల క్రితం దరఖాస్తు చేసినా పట్టించుకోవడం లేదు. **- సయ్యద్ హబీబ్, నాగారం(లింగంపేట)**

22 నెలలుగా వేతనాలు లేవు

ప్రభుత్వ పాఠశాల్లో పనిచేస్తున్న తమకు 22 నెలలుగా వేతనాలు రావడం లేదని పార్ట్‌టైం స్వీపర్లు విన్నవించారు. 40 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న తమను ఉద్యోగులుగా క్రమబద్ధీకరించాలని కోరారు. ప్రస్తుతం తమకు రూ.5200 వేతనం ఇస్తున్నారని, అదీనూ 22 నెలలుగా నిలిచిపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

పంటల నమోదు నుంచి తప్పించండి

డీసీఎస్(డిజిటల్ క్రాప్ బుకింగ్) యాప్ విధుల నుంచి తమను తప్పించాలంటూ ఏఈవోలు ప్రజావాణిలో కలెక్టర్‌కు విన్నవించారు. ఇప్పటికే 12 రకాల యాప్‌లలో 49 అంశాలకు సంబంధించిన పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఉదయం 7 నుంచి రాత్రి 7 వరకు క్షేత్రస్థాయిలో ఉన్నప్పటికీ పంటల నమోదు నిర్ణీత సమయంలో పూర్తి చేయలేకపోతున్నామని వాపోయారు. పంటల నమోదును ఇతర రాష్ట్రాల్లో ప్రత్యేక ఏజెన్సీలకు అప్పగిస్తున్నారని తెలిపారు.



కలెక్టరేట్‌కు వచ్చిన ఏఈవోలు

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

ఎన్నికల హామీలో భాగంగా క్వింటా బియ్యానికి రూ.300 కమిషన్ ఇవ్వాలని రేషన్ డీలర్లు కోరారు. డీలర్లకు రూ.10 లక్షల బీమా, ఆరోగ్య కార్డులు జారీ చేయాలని పేర్కొన్నారు. దిగుమతి హమాలీని ప్రభుత్వమే భరించాలన్నారు. గ్రామాలు, పట్టణాల్లో రేషన్ దుకాణాలకు ప్రభుత్వం స్థలం కేటాయించాలని, తమ సమస్యలు పరిష్కరించాలని ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు.



ఉపకార వేతనాల మంజూరుకు నిబంధనలు

కామారెడ్డి కలెక్టరేట్ : ఎస్సీ విద్యార్థులకు పోస్టు మెట్రిక్ ఉపకారవేతనాల దరఖాస్తులు, మంజూరుకు ప్రభుత్వం కొత్త నిబంధనలు పొందుపరిచిందని జిల్లా షెడ్యూల్డ్ కులాల అధికారిణి రజిత సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25 విద్యా సంవత్సరం నుంచి ఉపకార వేతనాల కోసం మూడు దశల్లో ప్రక్రియ పూర్తి చేస్తారని తెలిపారు. డెమో, బయోమెట్రిక్ అథెంటికేషన్లు, రిజిస్ట్రేషన్ ప్రక్రియలు పూర్తిచేయాలని పేర్కొన్నారు.

శాంతి ర్యాలీని విజయవంతం చేయాలి

రెడ్డిపేట్‌తండా(రామారెడ్డి), న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల గాంధీభవన్ శాంతి ర్యాలీని విజయవంతం చేయాలని ప్రధానోపాధ్యాయుడు కృష్ణ మోహన్ అన్నారు. సోమవారం రెడ్డిపేట్‌తండాలో ర్యాలీ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. జీవో 317 రద్దు చేసి, స్థానిక జిల్లాలకు పంపాలని డిమాండ్ చేశారు. అక్టోబరు 2న చలో గాంధీ భవన్ శాంతి ర్యాలీలో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు. ప్రకాష్, స్వామి, కృష్ణ, సురేష్, సంతోష్‌కుమార్, శ్రీనివాస్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

'దేవాదాయ శాఖను రద్దు చేయాలి'

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: దేవాదాయ శాఖను రద్దు చేసి ధార్మిక పరిషత్‌ను ఏర్పాటు చేయాలని కామారెడ్డి జిల్లా విశ్వహిందూపరిషత్ ప్రధాన కార్యదర్శి బొల్లి రాజు అన్నారు. తిరుమల వెంకటేశ్వర స్వామి లడ్డూ వివాదంపై జిల్లాకేంద్రంలో సోమవారం వీహెచ్‌పీ ఆధ్వర్యంలో పురపాలక కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి మాట్లాడారు. దేవాలయాల్లో తయారు చేసే ప్రసాదాల విషయంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. అనంతరం జిల్లాకేంద్రంలో ర్యాలీ తీశారు. కలెక్టరేట్ కార్యాలయానికి వెళ్లి అక్కడ నిరసన తెలిపారు. వినతిపత్రం అందజేశారు. ప్రతినిధులు సామల గంగారెడ్డి, గోపాలకృష్ణ, నాగభూషణం, బజరంగ్‌దళ్, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, భాజపా పట్టణాధ్యక్షుడు భరత్, ఫ్లోర్ లీడర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



కామారెడ్డిలో ధర్నా చేస్తున్న విశ్వహిందూపరిషత్ ప్రతినిధులు

సమతుల ఆహారంతో హృదయం పదిలం

సదాశివనగర్, న్యూస్‌టుడే : హృదయాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవాలంటే ప్రతి ఒక్కరు సమతుల ఆహారంతో పాటు వ్యాయామం చేయాలని ప్రిన్సిపల్ శోభారాణి పేర్కొన్నారు. సదాశివనగర్ మండలం మర్కల్ శివారులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో సోమవారం వరల్డ్ హార్ట్ డేను నిర్వహించారు. జువాలజీ విభాగానికి చెందిన వనజ హృద్రోగ వ్యాధిగ్రస్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చికిత్స అంశాలను విద్యార్థినులకు వివరించారు. అనంతరం విద్యార్థులకు పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో లైఫ్ సైన్సెస్ ఫ్యాకల్టీ డాక్టర్ ఉజ్మాసుల్తానా, సింధూర, చంద్రకళ, అష్రా, నేహా, రచన, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

ఆత్మీయ సమ్మేళనం

బాన్సువాడ పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని జడ్పీ కొనా బాన్సువాడ ఉన్నత పాఠశాల 2003-04 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాత జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. 20 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణారెడ్డి, రూప దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో విద్యార్థులు వినోద్‌రెడ్డి, అజ్మత్, రాజు, సాయిరాం, సుకన్య, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.



కొనా బాన్సువాడ 2003-04 బ్యాచ్ విద్యార్థులు

అనారోగ్య భయంతో ఆసుపత్రిలో ఆత్మహత్య

కామారెడ్డి నేరవిభాగం, న్యూస్‌టుడే: ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన జిల్లా కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. పట్టణ ఎస్సై శ్రీరామ్ తెలిపిన వివరాల ప్రకారం.. లింగంపేటకు చెందిన లింగాల సాయిలుకు 15 రోజుల క్రితం కుడి చేయి వేలికి చెక్క గుచ్చుకొని మణికట్టు వరకు ఇన్‌ఫెక్షన్ అయింది. దీంతో కుటుంబ సభ్యులు సెప్టెంబరు 23న జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పారు. రెండు రోజుల అనంతరం రోగిని ఇంటికి పంపించారు. గాయం పెద్దది కావడంతో 29వ తేదీన మళ్లీ ఆసుపత్రిలో చేర్పారు. ఈ క్రమంలో తనకు అయిన గాయం తగ్గుతుందో లేదో.. ఎంత డబ్బు ఖర్చవుతుందోనని మనస్తాపానికి గురై జీవితంపై విరక్తి చెందిన ఆసుపత్రిలోని స్నానాల గదిలో ఉరేసుకొని అఘాయిత్యానికి పాల్పడ్డారు. మృతుడి భార్య స్వరూప ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

కామారెడ్డి నేరవిభాగం, న్యూస్‌టుడే: తాళం వేసి తీర్థయాత్రలకు వెళ్లిన ఇంట్లో చోరీ జరిగిన ఘటన జిల్లా కేంద్రం శివారులోని ఇంద్రానగర్ కాలనీలో సోమవారం వెలుగు చూసింది. కాలనీకి చెందిన దత్తాద్రి తన భార్యతో కలిసిన సెప్టెంబరు 16న ఇంటికి తాళం వేసి తీర్థయాత్రలకు వెళ్లారు. సోమవారం తిరిగి వచ్చిన వారు ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై శ్రీరామ్ తెలిపారు. ఇంట్లోని 2.4 తులాల బంగారు, 15 తులాల వెండి ఆభరణాలు, రూ.10 వేల నగదును దుండగులు చోరీ చేసినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు.



శివను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపిక

ఎల్లారెడ్డి, న్యూస్‌టుడే : నిజామాబాద్ జిల్లా మంచిప్ప ఉన్నత పాఠశాలలో జరిగిన ఉమ్మడి జిల్లాస్థాయి రెజ్లింగ్ పోటీల్లో ఎల్లారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న శివ బంగారు పతకం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు రాజేశ్వర్‌శర్మ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని ఉపాధ్యాయులు అభినందించారు. ఉపాధ్యాయులు మాణిక్యం, యాదయ్య, మధుసూదన్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, లాల్‌సింగ్, హన్మంతరెడ్డి, లలిత తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి వాలీబాల్ క్రీడలకు...

భిక్కనూరు, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం భిక్కనూరు సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో నిర్వహించిన వాలీబాల్ అండర్- 14 విభాగంలో భిక్కనూరు విజ్ఞాన్ పాఠశాలకు చెందిన ముస్తకిన్, రిత్విక్‌లు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరెస్పాండెంట్ విజయ్‌భాస్కర్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు.

మంత్రి ఉత్తమ్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే

బాన్సువాడ పట్టణం, న్యూస్‌టుడే: మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తండ్రి పురుషోత్తంరెడ్డి మరణించడంతో హైదరాబాద్‌లోని నివాసంలో ఆయనను సోమవారం ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పురస్కారానికి ఎంపిక

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ వైద్యశాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉత్తమ రక్తదాతల పురస్కారానికి కామారెడ్డికి చెందిన రక్తదాతల సమూహ బాధ్యుడు బాలు ఎంపికయ్యారు. ఈయన ఇప్పటివరకు 74 సార్లు రక్తదానం చేశారు. తలసేమియా బాధితుల కోసం వేలాది యూనిట్ల రక్తాన్ని సేకరించారు.

సొసైటీ అభివృద్ధికి రైతులు సహకరించాలి

బిచ్కుంద, న్యూస్‌టుడే: బిచ్కుంద సొసైటీ అభివృద్ధికి రైతులు సహకరించాలని అధ్యక్షుడు నాల్చర్ బాలు పేర్కొన్నారు. సోమవారం 57వ మహాజన సభను అధ్యక్షుడు నిర్వహించారు. సమావేశానికి ఎండీ హాజరుకాక పోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏక కాలంలో రూ. 2లక్షల రుణ మాఫీ చేయాలని రైతులు కోరారు. ఉపాధ్యక్షుడు యాదవ రావు, సీఈవో శ్రావణ్, సొసైటీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్ : ఏకకాలంలో రూ.2లక్షల రుణ మాఫీ చేయాలని సొసైటీ ఛైర్మన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఛైర్మన్ అధ్యక్షతన సోమవారం మహాజన సభను నిర్వహించారు. అనంతరం రైతులకు శనగ విత్తనాలు పంపిణీ చేశారు. ఉపాధ్యక్షులు సంగారెడ్డి, డైరెక్టర్లు, కార్యదర్శి సందీప్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



కామారెడ్డి: ధర్మశాలలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



గోదాం రోడ్డులోని ప్రకృతివనంలో..



గాంధారి ఎంపీపీఎస్ బాలికల పాఠశాలలో..



దోమకొండలో ...

ఒక్కేసి పువ్వేసి సందమామా..

ఒక్కేసి పువ్వేసి సందమామా, బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అంటూ మహిళలు ఆడిపాడారు. జిల్లా వ్యాప్తంగా సోమవారం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ధర్మశాల, వీక్లీమార్కెట్, విద్యానగర్, అశోక్‌నగర్ తదితర ప్రాంతాల్లోని ఆలయాలు, కూడళ్ల వద్ద బతుకమ్మలు ఉంచి ఆడారు. అనంతరం నీళ్లలో నిమజ్జనం చేశారు. న్యూస్‌టుడే, బృందం




భిక్కనూరు సిద్ధార్థ విద్యాలయంలో..



ఎల్లారెడ్డి : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో...

సమస్యల పరిష్కారానికి కృషి

బాన్సువాడ పట్టణం, న్యూస్‌టుడే: ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు టీఎన్‌జీవోస్ ఎల్లప్పుడూ ముందుంటుందని సంఘం జిల్లాధ్యక్షుడు వెంకటరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని సంఘ భవనంలో సోమవారం సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ నెల 5న బాన్సువాడ తాలుకా ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ సభ్యత్వం నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రతినిధులు వెంకట్, దేవరాజ్, లక్ష్మణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



బాన్సువాడలో సభ్యత్వ నమోదు చేపడుతున్న ప్రతినిధులు

గిరిజనుల అభ్యున్నతికి కృషి

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: గిరిజనుల అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానని గిరిజన కార్పొరేషన్ సంస్థ ఛైర్మన్ బెల్లయ్యానాయక్ అన్నారు. జిల్లా కేంద్రానికి సోమవారం వచ్చిన సందర్భంగా వివిధ పక్షాల ప్రతినిధులు ఆయనను సన్మానించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఉచిత బస్సు, రుణమాఫీ, గృహజ్యోతి తదితర పథకాలను పక్కాగా అమలు చేస్తోందని బెల్లయ్యానాయక్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు రాణాప్రతాప్, లంబాడ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు గణేశ్ నాయక్, ప్రతినిధులు ప్రకాశ్‌నాయక్, మోహన్ నాయక్, పూల్ సింగ్, వినోద్, గణేశ్ తదితరులు ఉన్నారు.



కామారెడ్డిలో బెల్లయ్యనాయక్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ప్రతినిధులు

టై, బెల్టుల పంపిణీ

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన 1980-82 బ్యాచ్ విద్యార్థులు మల్లాయపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం టై, బెల్టులు అందజేశారు.

మాచారెడ్డి, న్యూస్‌టుడే: పల్వంచ ప్రభుత్వ పాఠశాల గ్రంథాలయానికి గ్రామపెద్దలు రూ.10 వేలు విలువ చేసే పుస్తకాలను సోమవారం వితరణ చేశారు. ప్రధానోపాధ్యాయుడు గోవర్ధన్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, బాల్‌రాజు, శేఖర్ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

నాగిరెడ్డిపేట్, న్యూస్‌టుడే: లింగంపేట్ మండలంలోని శెట్పల్లి సంగారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యురాలు హిమబిందు, నేత్ర వైద్య అధికారి హరికిషన్ రావు, క్లబ్ అధ్యక్షుడు రాజనర్సింహారెడ్డి తదితరులు ఉన్నారు.

వసతులు కల్పించాలి

భిక్కనూరు, న్యూస్‌టుడే: భిక్కనూరు ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో తాగు నీరు, మూత్రశాల వసతులు కల్పించాలని భిక్కనూరుకు చెందిన యువకులు తహసీల్దార్ శివప్రసాద్‌కు వినతి పత్రం ఇచ్చారు. రవిందర్, రాజు, సాయినిఖిల్ ఉన్నారు.



నిందితుడితో ఆబ్కారీ అధికారులు

ఎండు గంజాయి పట్టివేత...

పెద్దకొడప్‌గల్, న్యూస్‌టుడే: ఎండు గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న ఓ వ్యక్తిని పట్టుకొని అరెస్టు చేసిన సంఘటన పెద్దకొడప్‌గల్ మండలంలో సోమవారం చోటు చేసుకుంది. బిచ్కుంద ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని తలాబ్ తండా చౌరస్తా వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా..పోచారం తండాకు చెందిన బర్దవల్ గోబ్ర్యా ద్విచక్ర వాహనంపై 3.2 కిలోల ఎండు గంజాయిని అక్రమంగా రవాణా చేస్తుండగా పట్టుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టులో రిమాండు చేయగా గోబ్ర్యాను జైలుకు తరలించినట్లు పేర్కొన్నారు. తనిఖీల్లో ఎస్సై నగేష్, సిబ్బంది శ్రీధర్, సందీప్‌రెడ్డి, శ్రీకాంత్, అనిత పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

పోచారం కాల్వలో పడి యువకుడి మృతి

నాగిరెడ్డిపేట్,న్యూస్‌టుడే: గోపాల్‌పేట్ గ్రామానికి చెందిన గోరుకుల లక్ష్మణ్ (23) భవన నిర్మాణ కూలి. గత శనివారం అమ్మమ్మ మృతి చెందడంతో అంత్యక్రియలకు వెళ్లి వచ్చిన లక్ష్మణ్ స్నానం నిమిత్తం సమీపంలోని పోచారం కాలువ వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు అందులో మునిగి చనిపోయాడు. ఇది తెలియని కుటుంబసభ్యులు పలు ప్రాంతాల్లో గాలించారు. సోమవారం రాంప్రతాప్ థియేటర్ సమీపంలో మృతదేహం కనిపించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మల్లారెడ్డి చెప్పారు.



లక్ష్మణ్

రైతులపై కేసు

నాగిరెడ్డిపేట్,న్యూస్‌టుడే: మాల్తుమ్మెద విత్తన క్షేత్రంలో నాలుగెకరాల భూమిలో అక్రమంగా పంట సాగు చేస్తున్న రైతులపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై మల్లారెడ్డి తెలిపారు.

చోరీకి యత్నం

బాన్సువాడ పట్టణం, న్యూస్‌టుడే: చోరీ చేసేందుకు వచ్చిన దొంగను ఓ మహిళ నిలువరించడంతో అక్కడి నుంచి పరారైన ఘటన పట్టణంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చైతన్యకాలనీకి చెందిన సునీత.. తన భర్త విధులకు వెళ్లగా ఇంట్లో ఒంటరిగా ఉన్నారు. రాత్రి సమయంలో ఓ వ్యక్తి ఇంటి తలుపులు తట్టాడు. భర్త వచ్చాడని తలుపు తీసి చూడగా దొంగ లోపలికి వచ్చి ఆమెపై దాడి చేశాడు. దీంతో ఆమె ప్రతిఘటించి అతనిని చితకబాదారు. దొంగ బయటకు వెళ్లేందుకు ప్రయత్నించగా.. కింద అద్దెకు ఉండే వారు అతనిని పట్టుకునేందుకు చూశారు. దీంతో మొదటి అంతస్తు నుంచి దూకి పారిపోయాడు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సునీత చెప్పారు.

మొగుళ్ల చెరువును కాపాడండి

ఎల్లారెడ్డి, న్యూస్‌టుడే : ఎల్లారెడ్డి 5వ వార్డు పరిధి గండిమాసానిపేటలోని మొగుళ్ల చెరువు భూమి ఆక్రమణకు గురవుతోందని, కబ్జారాయుళ్ల నుంచి కాపాడాలని స్థానిక రైతులు, నాయకులు సోమవారం ఆర్డీవో ప్రభాకర్‌కు వినతిపత్రం అందించారు. సర్వే నంబరు 446లో భూమిని కొందరు ఆక్రమించుకున్నారని తెలిపారు.

నాగిరెడ్డిపేట్,న్యూస్‌టుడే: నాగిరెడ్డిపేట మండలంలోని జప్తిజాన్కంపల్లి, బొల్లారం గ్రామాల ఉమ్మడి చెరువు కబ్జాకు గురైందని, వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని సోమవారం తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతి పత్రం ఇచ్చారు.

స్టేడియం ఏర్పాటుకు వినతి

జుక్కల్, న్యూస్‌టుడే: పెద్దఏడ్గి గ్రామానికి ఆనుకొని ఉన్న విశాల స్థలంలో స్టేడియం ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరు చేయించాలని యువకులు ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు తోటకు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆ ప్రదేశానికి తీసుకెళ్లి స్థలాన్ని చూయించారు. ఎమ్మెల్యేకు శాలువా కప్పి..టోపీ పెట్టి సన్మానించారు. ఉమాకాంత్, మారుతి పటేల్, అపాసివార్ రవీందర్, మారుతి, తదితరులు ఉన్నారు.